Eenadu Dt 25/06/18.

# మెట్రో మార్గం.. హరితహారం!

- ముస్తాబవుతున్న రహదారులు
- బాటసారులకు అందమైన బాటలు



బాటలపై వాహనాలు వెళ్లకుండా సిమెంటు దిమ్మెల ఏర్పాటు, పక్కనే మొక్కలు

**జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే:** మెట్రో రాకతో జూబ్లీహిల్స్ రూపురేఖలు మారుతున్నాయి. ప్రధానంగా ఆ మార్గంలో రహదారుల పక్కన అందాలు రెట్టింపవుతున్నాయి. పచ్చని అందాలతోపాటు నగరాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే అందాలు సమకూరుతున్నాయి. వర్షపు నీరు వెళ్లే దారులు మొదలుకొని.. పాదచారుల బాట వరకు ప్రత్యేక అందాలు సంతరించుకొంటున్నాయి. పచ్చదనానికి ఎరుపు తివాచీ వేస్తున్నారు. కంటికింపుగా రంగుల చిత్రకళలు.. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడుగుంతలు.. ఇలా అన్నీ మెట్రో రాకతో సమకూరుతున్నాయి.

అమీర్‌పేట ప్రధాన కూడలి నుంచి మెట్రో పనులు సైబర్ టవర్స్ వైపు సాగుతున్నాయి. అమీర్‌పేట నుంచి సారథి స్టూడియో మీదుగా యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు, కృష్ణానగర్‌ల మీదుగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 5 నుంచి రోడ్డు నంబరు 1 ద్వారా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు చేరుతుంది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36 మీదుగా మాదాపూర్ సైబర్ టవర్స్ వైపు వెళ్తుంది. ఈ సంవత్సరాంతానికి ఈ మార్గంలో మెట్రో పనులు పూర్తి చేసి మెట్రో రైలును ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడ పనులు చకచకా కొనసాగిస్తున్నారు. ప్రధానంగా మెట్రో స్టేషన్‌ల వద్ద అందాలను రెట్టింపు చేసేందుకు మెట్రో అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారు.

### పచ్చదనం.. కొత్తదనం

ప్రధానంగా మెట్రో స్టేషన్ల పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నేపథ్యంలోనే మెట్రో స్టేషన్‌లు వచ్చే ప్రాంతంలో ఇప్పటికే డిజైనర్ పాద బాటలను వేస్తున్నారు. సరికొత్తగా, రంగులు రంగులుగా ఉన్న పాదబాటలు ఆకట్టుకొనేలా ఉన్నాయి. ఇప్పటికే జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లో ఈ బాటలు పూర్తయ్యాయి. మరోవైపు దారి పక్కన మొక్కలను ఏర్పాటు చేశారు. వాటి పక్కనే వర్షం పడినా, రహదారులపైకి వచ్చే నీరు ఒక పద్ధతి ప్రకారం వెళ్లేలా సాసర్ డ్రైన్స్‌ను ఏర్పాటు చేశారు.

### అయిదేసి కిలోమీటర్లు..

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి సైబర్ టవర్స్ వరకు ఉన్న అయిదు కిలోమీటర్ల రహదారిని తిరిగి సైబర్ టవర్స్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఉన్న అయిదు కిలోమీటర్ల దారి పక్కన ఈ కొత్త అందాలు పరుచుకోనున్నాయి. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లో మూడు మెట్రో స్టేషన్లు రానున్నాయి. ఇందులో భాగంగా ఒకటి కళాంజలి కూడలి, జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ ముందు, నీరూస్ కూడలిలో ఈ స్టేషన్లు వస్తున్నాయి. దాదాపు 900ల మీటర్ల దూరంలోనే మూడు మెట్రో స్టేషన్లు రావడం ఈ రహదారి ప్రత్యేకత. ఈ నేపథ్యంలోనే ఈ దారిలో డిజైనర్ పాదచారుల బాటలు, చెట్లు, నీళ్లు వెళ్లడానికి సాసర్ డ్రైన్స్‌ను ఇప్పటికే తీర్చిదిద్దారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ ముందు మినహా ఈ దారిలో మెట్రో పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. ఇక ఈ దారిలో ఉన్న మెట్రో పిల్లర్లకు ఇప్పటికే రంగులద్దారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా చిత్రాలను ఏర్పాటుచేశారు. నీటిని ఒడిసిపట్టేందుకు ప్రత్యేకంగా ఇంకుడుగుంతలను ఏర్పాటు చేశారు.



మెట్రో స్తంభాలకు బొమ్మలు వేస్తున్న కళాకారుడు

### పార్కింగ్ చేయకుండా..

వివిధ ప్రాంతాల్లో ఉండే ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో చాలా మంది వాహనదారులు ద్విచక్రవాహనాలను పాదబాటలపై నడుపుతుంటారు. దీనివల్ల నడవలేని పరిస్థితి ఉంటుంది. మరికొన్ని ప్రాంతాల్లో బాటలు వేయగానే చిరువ్యాపారాలు చేసే వారు ఆయా ఆక్రమించి వాటిపైనే వ్యాపారాలు చేస్తుంటారు. డిజైనర్ బాటల వల్ల ఇప్పుడా పరిస్థితి లేదు. దీనికితోడు వాహనాలు రాకుండా అడ్డుగా సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. వాహనాలు ఇక వెళ్లలేవు.

### వీటిపై దృష్టిపెట్టాలి..

జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లో వేసిన డిజైనర్ బాటలు ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాయి. ఈ దారిలో జలమండలి, జీహెచ్ఎంసీకి సంబంధించిన మ్యాన్‌హోల్స్ నోరు తెరుస్తుండటంతో మురుగునీరు ఆయా అందమైన దారుల వెంట పారుతుంది. ప్రధానంగా చట్నీస్ ముందు ఉన్న డైమండ్ స్టోర్ దుకాణం ముందు ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ఈ దారిలో మురుగు ప్రతి నిత్యం పారుతుంది. ఇక ఇక్కడే పాదబాటపై వచ్చిన మ్యాన్‌హోల్ వల్ల ఇలాంటి సమస్యనే తలెత్తుతోంది. మెట్రో అధికారులు జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ సమస్య రాకుండా చేస్తే మెట్రో అధికారులు చేసే ప్రయత్నానికి మరింత వన్నె లభిస్తుంది.